క్లుప్తంగా

వైభవంగా శాంతి కల్యాణం


పూజలు చేస్తున్న యాజ్ఞిక స్వామి

భీమడోలు: గుండుగొలనులోని ప్రసిద్ధి చెందిన శ్రీ సీతారామ స్వామివారి ఆలయంలో గురువారం స్వామివార్లకు పాలాభిషేక పూజలు, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం వేడుకగా జరిగింది. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగా రాజ్‌కుమార్ ఆధ్వర్యాన యాజ్ఞిక స్వామి దివి గోపాలాచార్యులు, ఆలయ పూజారి సాయి సుధీరాచార్యులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీరామ జపం చేస్తూ విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా అయోధ్య శ్రీరామ ప్రతిష్ఠ అక్షితల కలశాలను భక్తులకు ప్రసాదించేందుకు గానూ ఆలయంలోని స్వామివారి ఎదుట ఉంచి పూజలు చేశారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వ్యాయామ కళాశాల విద్యార్థుల ప్రతిభ


కప్ అందుకుంటున్న కళాశాల విద్యార్థులు

దెందులూరు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వర్సిటీ స్థాయిలో 5 జిల్లాల జట్ల మధ్య జరిగిన పోటీల్లో వ్యాయామ కళాశాల విద్యార్థులు ఆర్.సూర్య మణికంఠ, పి.సాయికిరణ్, ఎస్.భీమరాజు జిల్లాలో రెండో స్థానం సాధించారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ (ఎస్ఆర్ఎం)కు ఎంపిక కావటం సంతోషంగా ఉందన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటా..

దెందులూరు: తనను వైఎస్సార్ సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, పార్టీ మండలాధ్యక్షుడు కామిరెడ్డి నానికి రుణపడి ఉంటానని వాసే డోమెనిక్ అన్నారు. గురువారం పోతునూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయా నికి మరింత కృషి చేస్తానని డోమెనిక్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల యూత్ అధ్యక్షుడు

పెదపాడు: ఇటీవల వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షునిగా నియమితులైన గోరింక జగదీష్ టైట్లర్ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండే లాజర్, గుణుపూరు మహేష్, తంబి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఏర్పడిన మహిళా కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: హ్యూమన్ రైట్స్ మిషన్ (హెచ్ఆర్ఎం) ఆధ్వర్యంలో గురువారం జంగారెడ్డిగూడెంలో మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హెచ్ఆర్ఎం మండల అధ్యక్షుడు హనుమంతరావు, కార్యదర్శి సత్యనారాయణ, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణాదేవి ఆధ్వర్యంలో ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. నూతన కమిటీకి రాష్ట్ర అధ్యక్షులుగా గంగిరెడ్ల మేఘలాదేవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఆర్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే బాజీ, ఉపాధ్యక్షుడు ఎస్‌వీ కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కె.జయరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్ఆర్ కృష్ణబాబు నూతన కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. హెచ్ఆర్ఎం విధి విధానాలను వివరించారు.

హెల్త్ కార్డుల పంపిణీ

పోలవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తుందని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం వింజరం పంచాయతీ పరిధిలోని ఇటుకలకోట గ్రామంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్త్ కార్డులను వినియోగించుకుని వైద్యసేవలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను, వైద్యాధికారి మురళీధర్, మండల పరిషత్ ఏవో శ్రీనివాసబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సున్నం గంగాజలం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటగాళ్ల ప్రతిభకు ప్రోత్సాహం

- గ్రామగ్రామానా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు


పెదపాడు: హైస్కూల్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఉంగుటూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడ్తాయని ఏలూరు ఆర్డీవో ఖాజావల్లీ అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉంగుటూరు, గొల్లగూడెం, నారాయణపురం తదితర గ్రౌండ్స్‌లో క్రీడాకారులు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. ఉంగుటూరు హైస్కూల్ గ్రౌండ్‌లో నాచగుంట, ఉంగుటూరు సచివాయాల పరిధిలోని క్రీడాకారులు ఆడుతున్నారు. ఏలూరు ఆర్డీవో ఖాజావలీ కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వెంకటరమణ, ఈవోపీఆర్డీ సంషుద్దీన్, పంచాయతీ కార్యదర్శి గిరిధర్ ఉన్నారు. గొల్లగూడెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నాగు పర్యవేక్షణలో పోటీలు నిర్వహిస్తున్నారు.

ఉత్కంఠగా ఆటల పోటీలు

దెందులూరు: మండలంలో 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. ఎంఈవోలు ఏపీఎస్‌వీ ప్రసాద్, అన్నమ్మ, పాఠశాలల పీడీ, పీఈటీలు, గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో పోటీలు జరుగుతున్నాయి. పోతునూరు సచివాలయం -1, 2 మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో ఎ జట్టు, సి జట్టు విజయం సాధించాయి. విజేతలను హెచ్ఎం మధు సూదనరావు, పీడీ కృష్ణారావు, గ్రామ కార్యదర్శులు షరీఫ్, విద్యాసాగర్ అభినందించారు. తొలుత క్రీడాకారులను హెచ్ఎం పరిచయం చేసుకున్నారు.


దెందులూరు: పోతునూరు ఉన్నత పాఠశాలలో పోటీ పడుతున్న కబడ్డీ క్రీడాకారులు

యువతలో ఆరోగ్యం, ఆనందం

భీమడోలు: యువతలో ఆరోగ్యం, ఆనందాన్ని నింపేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు విజయవంతంగా సాగుతున్నాయని మండల ప్రత్యేకాధికారి, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక గ్రామాల్లో మూడో రోజు గురువారం జరిగిన ఆటల పోటీలను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 23 జట్లు ఖోఖో పోటీల్లో సత్తా చాటాయి. ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి వారిని మండల స్థాయి పోటీలకు పంపనున్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఈవోఆర్‌డీ సుందరి, గ్రామ కార్యనిర్వాహక అధికారులు సూర్య, మురళీకృష్ణ, ఎన్.ఠాగూర్, సచివాలయ ఉద్యోగులు, పీడీలు పాల్గొన్నారు.


భీమడోలు: ఖోఖో పోటీలను పరిశీలిస్తున్న ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలీ

క్రీడా స్ఫూర్తికి దోహదం

పెదపాడు: క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆమె కబడ్డీ పోటీలను ప్రారంభించి క్రీడాకారులతో కలిసి కాసేపు ఆడారు. పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు, ఎంఈఓ 2 డీవీ రమణ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆటల పోటీలు

పెదవేగి: మండలంలో 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. మూడో రోజు గురువారం ముండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేకాధికారి జీవీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ రాజ్‌మనోజ్, తహసీల్దార్ ఎస్.నాగరాజు ఆధ్వర్యాన వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ బృందం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పర్యవేక్షించారు.

క్రీడాసక్తి పెంపునకే 'ఆడుదాం ఆంధ్ర'

గణపవరం: గ్రామీణ యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంచడానికి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీడీవో జ్యోతిర్మయి అన్నారు. గురువారం మండలంలో పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఆరు ఉన్నత పాఠశాలల్లో జరిగిన పురుషుల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీల్లో 125 జట్లు పాల్గొన్నాయని ఎంపీడీవో తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని జట్లకు ఉన్నత పాఠశాలల పీడీల ఆధ్వర్యాన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పర్యవేక్షణలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


పెదవేగి: ముండూరులో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం


గణపవరం: గణపవరంలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న యువకులు


ఉంగుటూరు: ఉంగుటూరు హైస్కూల్ గ్రౌండ్‌లో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


నాగబాబును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అప్పనవీడు ఎంపీటీసీ బుద్దే రామసీత భర్త నాగబాబును ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పరామర్శించారు. ఇటీవల నాగబాబు పక్షవాతానికి గురికాగా, చికిత్స అనంతరం ఇంటికి చేరుకోవడంతో విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ గురువారం ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వైద్యుల సలహాలు పాటించి త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంట బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, కార్పొరేటర్ సాంబశివరావు, బీసీ సెల్ టౌన్ అధ్యక్షుడు లక్కోజు గోపి, గుణుపూరు మహేష్ తదితరులు ఉన్నారు.

జనార్దన స్వామికి విశేష పూజలు


పరుశురామావతారంలో జనార్దన స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి పరశురామావతార అలంకరణ చేశారు. రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


గోపన్నపాలెంలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: కరోనా విపత్తు వచ్చినప్పటికీ రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని వేగవరం గ్రామంలో రూ.24 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం. రూ.46 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరమ్మ కుమార్ బాబు, అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాస్, మండలాధ్యక్షుడు కామిరెడ్డి నానితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైఎస్ చైర్మన్ కాటి సుధాకర్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నాకుమారి, మంగంటి కృష్ణమోహన్, మోర్ల సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండేటి గంగాధర్ బాబు, జెడ్పీటీసీ నవకాంతం, ఎంపీడీవో భీమేశ్వరరావు, తహసీల్దార్ నాంచారయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఏనుగు హేమాసాగర్, కొండేటి బాబు, తోట పద్మారావు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు పాల్గొన్నారు.

రెండో విడత ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

దెందులూరు: వచ్చేనెల 3వ తేదీ నుంచి ఏలూరు రూరల్ మండలంలో జరిగే ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. గురువారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఏలూరు రూరల్ మండల నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచిని గుర్తు చేస్తూ, అలాగే వారి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజా ఆశీర్వాద యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రజలందరి ఆశీస్సులతో మొదటి విడత ప్రజా ఆశీర్వాద యాత్ర విజయవంతంగా పూర్తయిందని అన్నారు. సమావేశంలో వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, పార్టీ ఏలూరు మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీటీసీ మండల సరస్వతి కొండలరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడిపందేలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి


నిడమర్రు పీఎస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

నిడమర్రు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో సంప్రదాయం పేరిట గ్రామాల్లో కోడిపందేలు, జూదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. గురువారం నిడమర్రు పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు మరో మూడు నెలల్లో నిర్వహించే అవకాశం ఉన్నందున సిబ్బంది తగిన విధంగా పోలీంగ్ కేంద్రాల వివరాలు, సమస్య, అతి సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లోని మహిళా పోలీస్‌ల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఏడీఎస్పీ శ్రీనివాసరావు, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, నిడమర్రు, గణపవరం, చేబ్రోలు ఎస్సైలు ఆర్.శ్రీను, వెంకటేశ్వరరావు, మణికుమార్ ఉన్నారు.

భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఆయుధమే ఓటు


ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

పెదవేగి: భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఆయుధమే ఓటు హక్కు అని దెందులూరు నియోజకవర్గ అడిషనల్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జి.మనోజ్ అన్నారు. గురువారం పెదవేగి మండలం కొప్పాక, పెదకడిమి గ్రామాల్లో జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆయన మాట్లాడారు. కొత్త ఓటర్లను వచ్చేనెల 5వ తేదీ వరకు ఓటరు నమోదు, అదేవిధంగా ఫారం 7 ద్వారా మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిప ఓటర్లను తొలగించనున్నట్లు చెప్పారు. ఫారం 8 ద్వారా ఓటరు లిస్ట్‌లో తప్పొప్పులు సరిచేయనున్నారని, ఇందుకోసం ఎలక్షన్ కమిషన్ జనవరి 5వ తేదీ వరకు అవకాశాన్ని పొడిగించినట్లు తెలిపారు. అనంతరం ఓటు హక్కును సక్రమంగా వినియోగిస్తానని స్థానిక ఓటర్లతో మనోజ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- భీమడోలులో గడప గడపకు మన ప్రభుత్వం


భీమడోలు బీసీ కాలనీలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: రాష్ట్రంలోని ప్రతి ఇంటా కాంతులు నింపుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం సాయంత్రం భీమడోలులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసుబాబుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఆయన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రతి ఒక్కరినీ అప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. డ్రెయిన్లు, తాగునీటి సమస్యలను పరిష్కారించాలని మహిళలు, గ్రామస్తులు కోరారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని తూచ తప్పకుండా అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మెండైన ఆశీస్సులు అందించి మరోసారి ముఖ్యమంత్రిని చేసి మరో ఐదేళ్ల సంక్షేమం, అభివృద్ధి చేసేందుకు అవకాశమివ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీత, జెడ్పీటీసీ తుమ్మగుంట భవాని, ఎంపీపీ కనుమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఉప సర్పంచ్ ఇనపాల సాయి, సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, పార్టీ నాయకుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా, ఎంపీటీసీలు ఆళ్ల గోపి, గంటా శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, సచివాలయాల కన్వీనర్ ఆళ్ల సురేష్, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరెస్ట్‌కు ముందు ఉచిత న్యాయ సాయం

ఏలూరు రూరల్: నేరం మోపబడిన వ్యక్తి అరెస్ట్ అయ్యే ముందు న్యాయసేవాధికార సంస్థ నుంచి ఉచిత న్యాయ సాయం పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో న్యాయసేవాధికార సంస్థ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, కర్మాగారాలు, విద్యా తదితర సంస్థల్లో లింగ వివక్షత చూపించిన వారిని చట్టం కఠినంగా శిక్షిస్తుందని చెప్పారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేన్నారు. వివక్షతకు గురైన వ్యక్తులు ఎవరైన న్యాయ సాయం పొందవచ్చన్నారు. మరో అధికారిణి సూర్యచక్రవేణి మాట్లాడుతూ చిన్నపిల్లలకు బాల్య వివాహం, వెట్టిచాకిరి, భిక్షాటన చేయించడం నేరం అన్నారు. అలాంటి వారిపై చట్టం దృష్టిలో శిక్షార్హులవుతారని చెప్పారు. అనంతరం న్యాయాధికారులు స్థానిక జెడ్పీ పాఠశాల సందర్శించి, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ప్రణవి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

పోలవరం రూరల్: హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పోలవరంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం లక్ష తమలపాకుల పూజా కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించి, లక్ష తమలపాకుల పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే గూటాల గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు విజ్ఞప్తి చేశారు. కళాశాలలో గురువారం వినియోగదారుల హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేడు వినియోగదారులు చట్టాలపై అవగాహన లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వినియోగదారులకు రక్షణ చట్టాలు ఉన్నాయని, అవసరమైన సందర్భాలలో వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనేది వివరించారు. వినియోగదారుల కౌన్సిల్ మండల అధ్యక్షుడు కుకునూరి రామచంద్రరావు, కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఆర్.భాస్కరరావు మాట్లాడుతూ వినియోగదారుల తీర్పులకు సంబంధించి కోర్టు ఇచ్చిన తీర్పుపై సంతృప్తి చెందనట్లయితే పైకోర్టులకు ఏ విధంగా అప్పీలు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.మధు, అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, హనుమంతరావు, డా.కె.ఉత్తమ్ సాగర్, సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడానికి, వార్షిక లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. రామకృష్ణాపురం, పోస్టల్ కాలనీ, విజయ గార్డెన్స్, నెహ్రూ కాలనీ, గులాబి తోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అగ్రహారం, బావిశెట్టివారి పేట, నవాబు పేట, నల్లదిబ్బ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.